క్లుప్తంగా

సన్మానం



కాళేశ్వరం: అన్నారం మాజీ ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య పదవి ముగియడంతో గ్రామ అఖిలపక్ష నాయకులు ఆదివారం అన్నారంలో సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దుర్గయ్య 5సంవత్సరాల కాలంలో అందరికి సేవలనదించారని, పదవి విరమణ అనేది పదవికే కానీ మీ సామాజిక సేవకు కాదని, రెట్టింపుగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేమునూరి రమశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బండం రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా కార్యదర్శి వర్సవేణి నాగేష్ యాదవ్, కారోబార్ రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దునే సమ్మయ్య, ఆకుదారి మల్లేష్, అఖిలపక్ష నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వరద రాక చిన్నబోయిన గోదారమ్మ

కాళేశ్వరం: ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ఎగువ నుంచి తరలి వచ్చే గోదావరి, మహారాష్ట్ర నుంచి ప్రవహించే ప్రాణహిత నదులకు నీరు లేక ఎదురు చూస్తున్నాయి. దీంతో మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం వద్ద నీరు లేక గోదావరి చిన్నబోయి కనిపిస్తున్నది. ప్రతి ఏడాది జూన్ 15 నాటికి నీటితో రెండు ఉభయ నదులు పోటాపోటీగా ఉరుకలేస్తూ ఉధృతితో తరలిపోయేవి. ఈసారి వర్షాలు రెండు రాష్ట్రాల్లో అంతంతగానే కురుస్తుండడంతో నీరు తరలిరాక గోదావరిలో 20వేల క్యూసెక్కులు మాత్రమే ఈ మాసంలో దిగువకు తరలిపోతున్నాయి.


ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను నియమించాలి

ఏటూరునాగారం: తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను వెంటనే నియమించాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గంపల శివ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దళితులు ఇంకా సమానత్వం కోసం పోరాడుతూనే ఉన్నారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న శ్రీరాముల శ్రీనివాస్‌ను కులం పేరుతో వేధింపులకు గురిచేసి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన సీఐ, నలుగురు కానిస్టేబుళ్లను ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.5కోట్ల నష్టపరిహారం ఇవ్వడంతో పాటు ఎస్సై భార్యకు గ్రూప్2 ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పక్క జిల్లాలకు తరలుతున్న నీరు

కన్నాయిగూడెం: తలాపునే గోదావరి ప్రవహిస్తున్న ఇక్కడ నివసిస్తున్న వారికి చుక్క నీరు అందడం లేదని పక్క జిల్లాలకు తరలిస్తున్నారని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మంజాల భిక్షపతి అన్నారు. ఆదివారం ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మంజాల భిక్షపతి నాయకులతో కలిసి తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ, దేవాదుల ఎత్తిపోతలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమ్మక్క సాగర్ బ్యారేజీ దేవాదుల ఎత్తిపోతలతో చుట్టు పక్కల మండలాలకు గాని ఈ మండలానికి గానీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఇక్కడి నుంచి జనగామ, హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాలతో ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తున్నారని వాపోయారు. ఇక్కడి ప్రజలకు నీరు కావాలంటే రూ.లక్షలు వెక్షించి బోరులు వేసుకోని పంటలు, తాగు నీరు వాడుకోవలసిన పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇక్కడి చెరువులను రిజర్వాయర్‌లుగా నిర్మించి గిరిజన ప్రజలకు నీరు అందించాలని కోరారు.

మానస్‌లొద్దిలో 'మాన్‌సూన్' సందడి



వాజేడు : మండల పరిధి లోని దూలాపురం సమీపంలో గల గుట్టపై నుంచి జాలువారుతున్న మానస్‌లొద్దిని ఆదివారం వందల సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. జలపాతం నుంచి వచ్చే నీటి ధారలో స్నానాలు చేస్తూ సెల్ఫీలతో 'మాన్‌సూన్' సందడి చేశారు. అయితే పర్యాటకులు ఇక్కడి వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఎలాంటి రోడ్డు సౌకర్యం లేక, వాహనాలు వెళ్లలేక, కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. కాగా పర్యాటకులను అటవీ శాఖ ఇక్కడికి వెళ్లొద్దని గతంలోనే ఆదేశించింది. అడవిలో దూరంగా ఉండటం, రహదారి సౌకర్యం లేక పోవడం, నిర్మానుష్య ప్రదేశం కావడంతో పాటు ఎలాంటి ప్రమాదం జరిగినా సమాచారం తెలిసే అవకాశం లేదు. దీంతో మానస్‌లొద్ది సందర్శనకు వెళ్లొద్దని ఆదేశాలను జారీ చేశారు.

'రసాయనాల' వాడకం తగ్గేనా?

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కరువు

- తప్పని పరిస్థితుల్లో రసాయన ఎరువులను వాడుతున్న రైతులు



రసాయన ఎరువులు

మహాముత్తారం: మండలంలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం సేంద్రియ ఎరువులు, సేంద్రియ పద్ధతిలో పంటసాగు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాత్రం రసాయనాల ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులనే వాడాలంటున్నారు. కానీ, ఎక్కడో కొంత మంది రైతుల్లో మాత్రమే మార్పు కనబడుతోంది. ఆశించిన మేర రైతుల్లో సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపడంలేదని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంకా రసాయనిక ఎరువులతో సాగు చేసే రైతుల సంఖ్యే ఎక్కువగా ఉందని తెలుస్తోంది. రసాయనిక ఎరువులతో పంటలుసాగు చేయడంతో పెట్టుబడులు పెరిగి ఆశించిన దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారు.

రసాయనాలతో నష్టం

రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోయి సరైన దిగుబడి రాదు. ముఖ్యంగా రైతు సాగుపై పెట్టుబడులు పెరుగుతాయి. క్రిమి కీటకాలు సంహారానికి వినియోగించే మందులతో పర్యావరణానికి హాని కలుగుతుంది. అదే సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలకు చీడ, పీడల బెడద తగ్గుతుంది. మంచి దిగుబడులు సాధించవచ్చు. తక్కువ ఖర్చుతో మంచి లాభాలను పొందే అవకాశం ఉంది. పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. భూమి జవసత్వం పెరుగుతుంది. పర్యావరణానికి ఎలాంటి హానికలగదు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి సైతం మంచివని డాక్టర్లు చెబుతున్నారు.

సేంద్రియ ఎరువుల తయారీ విధానం

సేంద్రియ ఎరువుల తయారీ విధానం ప్రకృతి సిద్ధంగా ఉంటుంది. ఆకులు, అలములు, చెత్తాచెదారం, పశువులపేడా, ఆవు మూత్రంతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చు. పంట పొలాల వద్ద కానీ, ఇంటి వద్ద కుండీలను ఏర్పాటు చేసుకొని అందులో ఆకులు, ఇతర వ్యర్థ పదార్థాలను వేసి దానిపైన పశువుల పేడను కప్పి 45 రోజుల ఉంచినట్లయితే సేంద్రియ ఎరువు తయారవుతుంది. రైతులు ఇళ్ల వద్ద, పెరట్లలో, పంటపొలాల వద్ద ఇలాంటి ఎరువులను సొంతంగా తయారు చేసుకొని పంటల సాగులో వినియోగించినట్లయితే మంచి లాభాలు పొందవచ్చు.

సేంద్రియ ఎరువులతో మేలు



రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులు వాడినట్లయితే పంటలకు చీడ, పీడల బెడద ఎక్కువగా ఉండదు. మంచి దిగుబడులు వస్తాయి. సేంద్రియ ఎరువులతో సాగు మేలు.

- ధనిసింగ్‌నాయక్, నిమ్మగూడెం

అవగాహన కల్పించాలి



వ్యవసాయశాఖ అధికారులు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించాలి. రసాయనిక ఎరువుల వాడకమే ఎక్కువగా ఉంది. కొందరు రైతులు మాత్రమే సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ వ్యవసాయం చేస్తున్నారు.

- ఓలపు శంకర్‌పటేల్, కిష్టాపూర్

సింగరేణిని కనుమరుగు చేసేందుకు కుట్ర



మాట్లాడుతున్న రాజేందర్

కాటారం: ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణిని తెలంగాణ ప్రాంతంలో కనుమరుగు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పోలం రాజేందర్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజేందర్ మాట్లాడుతూ.. సింగరేణి జోలికి వస్తే సహించేది లేదన్నారు. సింగరేణిని కాపాడుకోవడం కోసం దశలవారిగా ఉద్యమాలు కొనసాగిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వంతు బాధ్యతగా సింగరేణి పరిరక్షణ కోసం ముందునడవాలని కోరారు. మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామగుండంకు వచ్చినప్పుడు ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని దొంగ హామీలు ఇచ్చారని విమర్శించారు. సింగరేణి కార్మికులకు అండగా ఉంటామని నమ్మబలికి ఈ రోజు సింగరేణినే లేకుండే చేసే విషపు కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. సింగరేణి బ్లాక్‌ల వేలం ప్రక్రియను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, మండల కమిటీ సభ్యులు మల్లేశ్వరీ, నాయకులు తిరుపతి, మానస, సరిత, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రేగొండ: మండలంలోని మడతపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 1998–99 పదో తరగతి విద్యార్థులు ఆదివారం కోటంచలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి సత్కరించారు. 25 ఏళ్ల తరువాత అంతా ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, సూర రాఘవులు, వేణుమాధవచారి, సత్యనారాయణ, మహేందర్‌రాజు, శ్రీనివాస్ పూర్వ విద్యార్థులు యాపశెట్టి దేవేందర్, లక్ష్మంరాజు, పేర్ల రజిత, కొత్త నర్సయ్య, పవన్, రఘు, రజిత, మంజుల, రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కలర్ కార్డుల విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో ఫ్రంట్ లైన్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఎల్లో, రెడ్ కార్డులు జారీ చేస్తూ కార్మికులను ఇబ్బంది పెడుతున్న నూతన కార్డుల విధానాన్ని రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం భూపాలపల్లి ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లు చేయకున్నా సింగరేణి యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డులను జారీ చేస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రజాస్వామ్యంలో ఎలాంటి సమాచారం లేకుండా కార్మిక సంఘాలతో చర్చించకుండా ఈ నూతన కార్డుల విధానాన్ని సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టడం దుర్మార్గమైన చర్య అని ఈ విధానాన్ని ఏఐటీయూసీగా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ విధానం రద్దు చేయకపోతే ఈనెల 19న జరిగే సింగరేణి ఉన్నత స్థాయి త్రైపాక్షిక సమావేశంలో చర్చించడం జరుగుతుందని, పెద్ద ఎత్తున ఈ విషయంపై ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, నాయకులు గురుజేపల్లి సుధాకర్‌రెడ్డి, మధుగాని విజేందర్, తాళ్ల పోషం, మురళి, అఖిల్, ప్రసన్నకుమార్, సాదిక్, కుమార్, కుమారస్వామిలు పాల్గొన్నారు.

గుర్రంపేట గ్రామస్తుల నిరసన



ఓసీ ప్రభావిత భూముల్లో నిరసన తెలుపుతున్న రైతులు

భూపాలపల్లి రూరల్: తమ గ్రామ పరిధిలోని ఓసీ–3లో ప్రభావిత భూములను సింగరేణి తీసుకొని పరిహారం అందించాలని కోరుతూ ఆదివారం గుర్రంపేట గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఓసీలో బొగ్గు కోసం చేపడుతున్న బ్లాస్టింగ్‌లతో బొగ్గు పెళ్లలు పొలాలు, చేలల్లో పడుతున్నాయన్నారు. వారం రోజుల క్రితం చేనులో పని చేస్తున్న రైతుపై బొగ్గు పెళ్ల పడటంతో గాయాలపాలయ్యాడన్నారు. ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని దినదిన గండంగా గడుపుతున్నామన్నారు. సింగరేణి యాజమాన్యం ఓసీ ప్రభావిత భూములను తీసుకొని పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కోడూరి రమేష్, జీడి రాజు, ఎల్లయ్య, సందీప్, శంకర్, సురేందర్ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్యను సన్మానం చేస్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాముకుంట్ల తిరుపతయ్య ఇటీవల నైన్‌పాక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి పొందిన సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తోటి మిత్రులు, గ్రామస్తులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ హాజరై మాట్లాడుతూ.. పాముకుంట్ల తిరుపతయ్య ఎంతో కష్టపడి 1997లో ప్రభుత్వ ఉద్యోగం సాధించి అంచెలంచెలుగా ఎదిగి ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందడం గ్రామస్తులకు ఎంతో గర్వకారణం అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య మాట్లాడుతూ.. గ్రామస్తులు ఇంత పెద్ద కార్యక్రమం చేసి తనను సన్మానం చేయడంతో తాను కష్టపడ్డ దానికి ఫలితం లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కట్కూరి నర్సయ్య, ఆరెపల్లి మల్లయ్య, నర్సింహారాములు, నాగేంద్రబాబు, ముత్యాల మొగిలి, శీలపాక రాజేందర్, గమ్మడి సత్యం, కట్కూరి మొగిలి, మాను రమేష్, పాముకుంట్ల రవి, చందర్, జన్నే యుగేందర్, గరుకుంట్ల కిరణ్, సదయ్య, ఏకు కిషన్, రాజమొగిలి, లక్ష్మన్, మైదం రాజ్‌కుమార్, మొగిలి, రాజు, గుర్రం అశోక్, ప్రణీత్, రమేష్, ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

కాటారం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన సీఐ జితేందర్‌రెడ్డి, పలువురు సిబ్బందిని కఠినంగా శిక్షించాలని ఉత్తర తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్య చాలా బాధాకరమన్నారు. నిజాయితీకి మారుపేరుగా నిలిచిన శ్రీనివాస్ విషయంలో సీఐ, ఇతర సిబ్బంది వ్యవహరించిన తీరుతో ఆయన మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థలోనే ఇలాంటి కుల వివక్షత, అనునిత్యం అవమానిస్తూ ఇబ్బందులకు గురి చేయడం లాంటివి నెలకొనడం శోచనీయం అన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపి సీఐ, సిబ్బందిని విధుల్లో నుంచి తొలిగించాలని పేర్కొన్నారు. ఎస్సై కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలిపారు.

గ్రామాల్లో బోనాల సందడి

కాటారం: ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో కాటారం మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బోనాల సందడి నెలకొంది. ఆషాఢమాసం మొదటి ఆదివారం కావడంతో భక్తులు గ్రామాల్లో పోశమ్మలు, గ్రామదేవతలకు మొక్కులు సమర్పించారు. డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలు ఎత్తి అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. కోళ్లు, మేకలు బలిచ్చి ఇంటిల్లిపాది సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

ములుగు రూరల్: అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ రెండోరోజు దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీల రిటైర్మెంట్ ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలన్నారు. కొంత మంది ఆయాలు, టీచర్లకు ఆధార్‌కార్డు ప్రకారం వయస్సు తక్కువ ఉంటే 65ఏళ్ల లోపల ఉన్నప్పటికీ మీరు రిటైరు అయ్యారు ఇక నుంచి సెంటర్‌కు రావద్దని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. వయస్సు నిర్ధారణకు బోన్ పరీక్షలు చేపిస్తామని మాట్లాడడం సరికాదన్నారు. ఇప్పటికైనా మంత్రి సీతక్క స్పందించి అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీలు ఆదిలక్ష్మీ, మానస, రాధిక, సన, లక్ష్మీ ఉన్నారు.

మావోయిస్టులకు ఆశ్రయం కల్పించొద్దు



ఏటూరునాగారం: మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్



వెంకటాపురం(కె): మాట్లాడుతున్న సీఐ కుమార్

ఏటూరునాగారం: మావోయిస్టులకు ఎలాంటి ఆశ్రయం కల్పించొద్దని సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని రాయబంధం గొత్తికోయగూడెంలో ఇళ్లను సోదాలు నిర్వహించి అసాంఘిక శక్తులు ఆశ్రయం కల్పించరాదని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆదివాసీ ప్రజలు ఏజెన్సీ ప్రాంతాలలో దట్టమైన అడవుల్లో నివసిస్తున్నందున వారికి విద్య, వైద్యం, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు అందించాలనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ, ఓఎస్‌డీ, ఏఎస్పీ దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. పిల్లలను చదివించే దిశగా వారిని ప్రోత్సహించాలని, ప్రస్తుత వర్షాకాలంలో విష జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. గర్భిణులు, వృద్ధుల వివరాలను సేకరించారు. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం ప్రాంతాల్లోని కన్నాయిగూడెం గొత్తికోయగూడేల వివరాలను సేకరించినట్లు తెలిపారు. మావోయిస్టుల ఆచూకీ తెలిపితే బహుమతి ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని సీఐ బండారి కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లాపురం, కత్రవానిగుంపు గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అనుమానిత వ్యక్తులు ఎవరైన గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువతకు ఉపాధి, ఉద్యోగ రంగాల్లో కావాల్సిన సహాయ సహకారాలను పోలీసుశాఖ నుంచి ఎల్లప్పుడు అందించేందుకు సిద్ధంగా ఉంటారని అన్నారు. ఎస్సై తిరుపతి రావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పోలీసులు తదితరులు ఉన్నారు.

వరి నాట్లు ప్రారంభం



మొద్దులగూడెంలో నాటు వేస్తున్న కూలీలు

బోరు, బావి నీళ్లపై నమ్మకంతోనే సాగు

గోవిందరావుపేట: మడలంలో వరినాట్లు ప్రారంభమైనవి. వర్షాలు సకాలంలో పడకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. బోరుబావుల కింద పోసిన నారు పెరగడంతో రైతులు నాట్లు వేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి రాత్రి వేళ రోజుకో గంట సేపు కురిసే వర్షంకి బోరు, బావులనీళ్ల సహాయంతో పంట పొలాల్లో నీళ్లని నిల్వ చేసి వరి నాట్లు వేస్తున్నారు. మండలంలోని పస్రా, మొద్దులగూడెం, గోవిందరావుపేట, బుస్సాపూర్, చల్వాయి గ్రామలలో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. చాలా మంది రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అనుకున్న స్థాయిలో వర్షాలు పడితే పూర్తి స్థాయిలో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ములుగు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆదివారం నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల అండదండలు ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15వ లోపు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయబోతున్నట్లు తెలిపారు. మంత్రి వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, వెంకటాపురం(ఎం) మండల అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, బొక్క సత్తారెడ్డి, వంశీకృష్ణ, కంబాల రవి, మట్టివాడ తిరుపతి ఉన్నారు.



భూపాలపల్లి రూరల్: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



మల్హర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా నాయకులు ఆదివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అలాగే మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశంలో దళితుల పక్షాన పోరాడి ప్రశ్నించే గొంతుక మంద కృష్ణ మాదిగ అని అన్నారు. మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



చిట్యాల: జెండా ఆవిష్కరిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు